ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 03 అక్టోబరు , 2026 | పేజీలు : 7




జర్నలిస్టుల హామీల అమలుకు గళమెత్తిన కలం

వివరాలు మెయిన్‌లో

# కొలువే లక్ష్యం.. కృషే ఆయుధం

200 మంది అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్:** ఉద్యోగమే లక్ష్యంగా ప్రణాళికతో చదివి, కృషి పట్టుదలతో కొలువు సాధించాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. సమయాన్ని వృథా చేయ కుండా లక్ష్యసాధనకు కృషి చేయాలని అన్నారు. పట్టణంలో శుక్రవారం ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది అభ్యర్థు లకు 47 రోజులపాటు శిక్షణ ఇచ్చి ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈసందర్భంగా వీరేశం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో అవసరమైన సహకారం అందిస్తానన్నారు.పేదరికం అడ్డంకి కాదని,పరిస్థి తులను ఎదురించి కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చున్నారు.ఉద్దీపన ఫౌండేషన్ గత 12 ఏళ్లుగా విద్యార్థుల చదువులకు సేవలందిస్తోం దని,పేద విద్యార్థుల కోసం నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పేపర్ లీకేజీలపై పోరాటాలు జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి స్ఫూర్తితో విజయాలు సాధించాలని అభ్యర్థులకు సూచించారు.ఈకార్య క్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ చెరుకు సతీష్, ఆర్సీ రెడ్డి కోచింగ్ సెంటర్ ఫ్యాకల్టీ వేముల సైదులు,మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు గాదగోని కొండయ్య, పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న,గాజుల సుకన్య, కరుణాకర్‌రెడ్డి,ఎడ్ల ప్రవీణ్,బొజ్జ సుందర్, యాసారపు వెంకన్న, సునీల్,గంగాధర్ భద్రయ్య పాల్గొన్నారు.

**పట్టభద్రుల ఓటు నమోదు చేసుకున్న వీరేశం**

నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల నియోజ కవర్గ ఎమ్మెల్సీ ఓటరుగా ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తన ఓటు ను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పట్టభ ద్రులైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపుని చ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, విద్యావంతులైన గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదై తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.



జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా హైదరాబాద్లోని లాల్ బహాదూర్ స్టేడియంలో 'బాపు బాట1157 చరకాల ప్రదర్శన' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ ని రామన్నపేట పద్మశాలి సంఘం అధ్యక్షులు ఇడెం శ్రీనివాస్,వెల్లంకి గ్రామ సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్ కలిసి,చేనేత రంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరంగా చర్చించారు. చేనేత కార్మికుల సంక్షేమం,అభివృద్ధి,జీవనోపాధి అవకాశాలు,చేనేత రంగం సమగ్ర అభివృద్ధిపై పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు.

\- ప్రజాపక్షం/రామన్నపేట

# అధికారుల నిర్లక్ష్యం... ప్రాణాలు పోతున్నాయ్

### కాలువలోకి దూసుకెళ్లిన మోటార్‌సైకిల్..యువకుడి మృతి

### ప్రమాదకర మలుపు వద్ద రక్షణ గోడ లేకే గాలిలో ప్రాణాలు

**ప్రజాపక్షం/నిడమనూరు:** మోటార్‌సైకిల్ అదుపుతప్పి ముదిమాణిక్యం మేజర్ కాలువలోకి దూసుకెళ్లడంతో ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన నిడమనూరు మండల పరిధిలోని ముకుందాపురం వద్ద చోటుచే సుకుంది.నిడమనూరు ఎస్ఐ డి. విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నల్ల గొండ మండలం శేషమ్మగూడెంకు చెందిన పేర్ల శరత్‌కుమార్ (30) తన స్నేహి తులతో కలిసి గురువారం వనవాసం కార్యక్రమానికి హాజరై,తిరిగి నల్లగొండకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ముకుందాపురం సమీపంలోని ముదిమా ణిక్యం మేజర్ కాలువ నాలుగో నంబర్ కాలువ వద్ద ఉన్న మూల మలుపులో రాత్రి సుమారు 10.45 గంటలకు మోటార్‌సైకిల్ అదుపుతప్పి కాలువలో పడిపో యింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శరత్‌కుమార్ నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.మృతుడి తల్లి పేర్ల లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడిం చారు.

**రక్షణ గోడ లేకే ప్రాణాలు పోతున్నాయి**

ఈ మార్గంలో నిత్యం అడవిదేవులపల్లి, హాలియా, మిర్యాలగూడ ప్రాంతాలకు వాహ నాల రాకపోకలు కొనసాగుతుంటాయి. అదేవి ధంగా కోటమైసమ్మ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ముదిమాణిక్యం మేజర్ కాలువ వద్ద ఉన్న ఈ ప్రమాదకర మలుపు వద్ద రక్షణ గోడ లేకపో వడం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. వాహనాలు అదుపుతప్పిన ప్రతిసారీ కాలువలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉందని స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివ రకు పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేదని వారు పేర్కొంటున్నారు.

**ఇకనైనా అధికారులు స్పందించాలి**



ఎన్ఎస్పీ,ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పరస్పర సమన్వ యంతో ప్రమాదకర ప్రాంతాన్ని పరిశీలించి తక్షణమే రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు,రేడియం సూచికలు ఏర్పాటు చేసి రాత్రివేళ వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టా లని విజ్ఞప్తి చేస్తున్నారు.మరో ప్రాణం పోయే వరకు వేచి చూడకుండా అధికా రులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

ప్రజాపక్షం/పెన్‌పహడ్: మండల పరిధిలోని మేగ్య తండాలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామసర్పంచ్ భూక్య రాజునాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాలోతు వర లక్ష్మి, రేషన్ డీలర్ భూక్య విజయ, పంచాయతీ కార్యదర్శి సంజయ్‌కుమార్, యాదగిరి, మండల నాయకులు యాటా ఉపేందర్, కుందురు వెంకట రెడ్డి, ముదిరెడ్డి రంగారెడ్డి, దాసరి మట్టయ్య, ధర్మానాయక్ పాల్గొన్నారు.

## సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులు



ప్రజాపక్షం/చందూరు: చందూరు మండలం బంగారిగడ్డ మాజీ సర్పంచ్ పాల్వాయి సత్యనారాయణ రెడ్డి (97) వృద్యాప్యంలో ఉండి గురువారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. గ్రామ సర్పంచ్‌గా సుదీర్ఘకాలం 30 సంవత్సరాలు నిస్వార్థంగా గ్రామ ప్రజలకు సేవలందించారు. శుక్రవారం బంగారిగడ్డ గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ బోయపల్లి సునీత ఆధర్వర్యంలో సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మహ్మద్ మహబూబ్ , పంచాయితీ కార్యదర్శి ఏరుకొండ కోటయ్య పాల్గొన్నారు.

## రేవూరులో గ్రామసభ

ప్రజాపక్షం/మేళ్లచెరువు: గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రేవూరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో విబిజి రాంజీ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జూనెబోయిన గురవయ్య మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి పనులను గుర్తించడం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఉపాధి హామీ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించడమే లక్ష్యమన్నారు. కూలీలకు కావాల్సినంత పని అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఖాజా అస్గర్‌అలీ, ఉప సర్పంచ్ ఓరుగంటి దుర్గభవాని, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డులు పంపిణీ

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: అర్హులైన వారందరికి ప్రభుత్వం అందజేసే రేషన్‌కార్డులు పొందాలని శ్రీనివాసపురం సర్పంచ్ కట్ట శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జింకల వీరాంజనేయులు, వార్డు సభ్యులు గోపాలరావు, రచ్చ సంజీవ్, శ్రీకాంత్, ఎఈవో ముస్తఫా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో డిసిఎం డ్రైవర్ మృతి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నార్కట్‌పల్లిఅద్దంకి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ అమ్మిరెడ్డి క్రిష్టారెడ్డి మృతి చెందారు. గురువారం రాత్రి కిష్టాపురం గ్రామం దాటిన అనంతరం భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా న్యూజెండ్ల గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి క్రిష్టారెడ్డి (52) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. దర్శి నుంచి హైదరాబాద్‌కు కరివేపాకు లోడుతో డీసీఎం వాహనం నంబర్ టీజీ 07 డబ్ల్యు 1008లో వెళ్తుండగా రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో భారత్ పెట్రోల్ బంక్ సమీపానికి చేరుకున్నారు. అదే సమయంలో ముందుగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక వైపు నుంచి డీసీఎం ఢీకొట్టింది.ప్రమాద తీవ్రతకు డీసీఎం రహదారి ఎడమ వైపునకు ఒరిగిపడింది. వాహనంలో క్రిష్టారెడ్డి ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే



మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వాహనం నుంచి బయటకు తీసి మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం, దాని డ్రైవర్‌ను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. రహదారులపై వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా వ్యవహరిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

# మహాత్మాగాంధీ స్ఫూర్తితో బుల్లెట్ ట్రైన్ సాధించి తీరుతాం

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: సూర్యాపేట గుండా బుల్లెట్ ట్రైన్ సాధన కోసం జరుగుతున్న ఉద్యమం 50 రోజులు పూర్తి చేసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అని సాధన సమితి చైర్మన్ ఆరుట్ల జానకి రెడ్డి అన్నారు. శుక్రవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గాంధీ బొమ్మ వద్ద ఏర్పాటు చేసిన 50వ రోజు మౌన దీక్ష కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించారు. ప్రజా ఆంకాక్షలకు ఉద్యమాలకు పుట్టినిల్లు లాంటి సూర్యాపేటకు అన్యాయం చేస్తే దేశ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ ఉద్యమం స్ఫూర్తితో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమ నాయకులు ధర్మ భిక్షం, బిఎన్‌రెడ్డి, మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, మారోజు వీరన్నల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు, స్వతంత్ర్య, తెలంగాణ ఉద్యమ పోరాటానికి ఏ విధంగా శ్రమించామో అదే తరహాలో రెట్టింపు



ఉత్సాహంతో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని ప్రతిఘటించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాసగౌడ్, ధర్మార్జున్, వై.వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల అన్నపూర్ణ, రామ్మూర్తి యాదవ్, చల్లమల్ల నర్సింహా, నెమ్మాది వెంకటేశ్వర్లు, మందాది దేవిదాస్, మార్, కొల్లు మధుసూదన్‌రావు, రమణాచారి, భూపతి రాములు, బండారు రాజా, తూడి నర్సింహారావు పాల్గొన్నారు.

# అక్షర వైకుంఠ రథం ఉచిత సేవలు ప్రారంభం



ప్రజాపక్షం/సూర్యాపేట: గాంధీ జయంతి సందర్భంగా అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో ఎస్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథం ఉచితసేవలను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సంకినేని కృష్ణారావు ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైకుంఠరథం ఉచిత సేవలను అందుబాటులోకి తీసుకరావడం అభినందనీయమన్నారు. సూర్యాపేట పట్టణంతో పాటు అన్ని గ్రామాల ప్రజలు ఈ ఉచిత సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అదే విధంగా విద్య, వైద్యం, క్రీడలు, సాంస్కృతిక, పర్యావరణం, సామాజిక రంగాలలో అక్షర ఫౌండేషన్ విశేష సేవలు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న తీరు అభినందనీయమని అన్నారు. వైకుంఠ రథం కావాల్సిన వారు 70362 59911, 70362 59922 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు రుద్రంగి కాళిదాస్, నరాల తిరుమలరెడ్డి, ఉప్పు నాగయ్య, ఉప్పుల మధు, బత్తుల దామోదర్‌రెడ్డి, బత్తుల ఉపేందర్, నెల్లుట్ల పాపయ్య, దండా శంకర్‌రెడ్డి, నజీర్ బాషా, గౌరిశెట్టి అప్పారావు, సొల్లేటి ఉపేంద్రచారి, కారింగుల బాలగౌడ్ పాల్గొన్నారు.

## మూఢ నమ్మకాలతో నేరాలకు పాల్పడవద్దు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: మూఢ నమ్మకాలతో నరబలి ఇవ్వడం వంటి దారుణ నేరాలకు పాల్పడటం ద్వారా జైలుపాలు కావడం తగదని సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యాంసుందర్ ఖైదిలకు హితవు చెప్పారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక సబ్ జైల్‌లో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ఖైదీలనుద్దేశించి మాట్లాడారు. లెజిస్లేటివ్, ఎగ్జిక్యూటివ్, జ్యూడిషియరి, పాత్రికేయ వ్యవస్థలు సమాజానికి నాలుగు స్థంభాలన్నారు. శాసన వ్యవస్థ చట్టాలను రూపొందిస్తే దానిని అమలు చేసే బాధ్యత ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ చూసుకుంటుందని ఈ రెండు వ్యవస్థలలో ఏమైనా లోపాలు ఉంటే న్యాయశాఖ సరిచేస్తుందని, ఈ మూడు శాఖలలో



ఉన్న లోపాలను పాత్రికేయ వ్యవస్థ బహిర్గతం చేస్తుందన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు ప్రదానం చేసి, అనంతరం మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరిండెంట్ చెరుకూరిగౌతమ్, వైద్య అధికారి నక్క రవికుమార్, ఉచిత న్యాయ సహాయ న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాదులు నాగేష్, రాథోడ్, సైదా హుస్సేన్, శంకర్‌నాయక్, షమీన్, జైలు సిబ్బంది సీతారామచందరరావు పాల్గొన్నారు.



## ఘనంగా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతి

ప్రజాపక్షం/సూర్యాపేట: ఘనంగా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్‌రెడ్డి వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచడంలో మహాత్మాగాంధీ పాత్ర అత్యంత కీలకమని, సత్యం, అహింస, సత్యాగ్రహం వంటి సిద్ధాంతాలను పాటిస్తూ స్వాతంత్ర్య సాధన కోసం గాంధీ ప్రజలను ఏకతాటిపైకి తీసుకవచ్చారని అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహానీయుడు శాస్త్రి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు వెంకన్న, షఫిఉల్లా, నేరేళ్ల మధు, పంది శ్రీనివాస్‌గౌడ్, సైదిరెడ్డి, ధర్మానాయక్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై సన్మానం పొందిన ధీరావత్ నీల్యా నాయక్, దనావత్ మక్క నాయక్‌లను శాసనమండలి సభ్యుడు కేతావత్ శంకర్‌నాయక్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు విశేష కృషి చేయాలని కోరారు. విద్యార్థులు దారి తప్పకుండా సన్మార్గంలో నడిచేలా వారికి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు బిక్కు నాయక్, గోపి నాయక్, నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్ల అంకెలు మారుస్తూ చలాన్లకు ఎగవేత

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: తన కారుకు ట్రాఫిక్ చలానుల పడకుండా తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్‌పై ఉన్న అంకెలను మారుస్తూ చలాన్ల పడేలా చేస్తున్న ఓ కారు డ్రైవర్‌ను సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. నంబర్ ప్లేట్‌లోని అంకెలను మార్చడం ద్వారా తన వాహనానికి బదులుగా అదే నెంబర్‌గా కనిపించే ఇతర వాహనాలపై చలాన్లు పడేలా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ యాదవేంద్రరెడ్డి మాట్లాడుతూ వాహన నెంబర్‌ను తారుమారు చేయడం, పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం చట్టరిత్యా నేరమని తెలిపారు. పట్టుబడిన కారుపై కేసు నమోదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇకపై ఎవరైనా తమ వాహనాలకు చలాన్లు పడకుండా ఉండేందుకు నెంబర్ ప్లేట్‌లో అంకెలను మార్చడం, ఇతర వాహనాలకు చలాన్లు పడేలా చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని సూర్యాపేట టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.





## కొండమల్లేపల్లి గ్రామ అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామంలో గల సమస్యలను వార్డు సభ్యులు, గ్రామ ప్రజలతో చర్చించి, సమస్యలను గుర్తించి నోట్ చేసుకున్నారు. వి బి జి రాంజీ పథకం కింద గ్రామంలో గుర్తించిన సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో మాతృనాయక్, పంచాయతీ కార్యదర్శి పానుగోతు డాకునాయక్, ఉప సర్పంచ్ కొడిదాల పద్మవెంకటయ్య, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో అనర్థాలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** బాల్య వివాహాలతో అనర్థాలు ఏర్పడతాయని మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సర్పంచ్ పందుల వెంకటయ్యగౌడ్ ఐసిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల అవగాహన సమావేశంలో అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళిక రచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. వెంకటయ్య, ఐసిడిఎస్ అధికారి అంజలి, ఉప సర్పంచ్ గడ్డం జ్యోతి, వార్డు సభ్యులు కూర దేవేందర్, ఇస్లావత్ సురేష్, ఇమ్మడి వెంకటమ్మ అంజయ్య, నర్సింహా, సరిత, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

**ప్రజాపక్షం/నకిరేకల్** :మండలంలోని చందుపట్ల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం మండల పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఉత్సవమూర్తులకు ప్రాణప్రతిష్ఠ చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా పుణ్యాహవాచనం,సుదర్శన హోమం, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం,బలిహరణ తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పూర్తి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రక్తంగా నిర్వహించారు.యాదగిరిగుట్ట ఉప ప్రధాన అర్చకులు పరాంకుశం భాస్కరాచార్యులు,భరత్‌స్వామి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈకార్యక్రమంలో కందిమల్ల లక్ష్మారెడ్డి,కందిమల్ల ప్రదీప్‌రెడ్డి,జయశృతి,సమీరాజారెడ్డి పాల్గొన్నారు.



# ఆర్‌టిసి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్):** తెలంగాణ ఆర్‌టిసి ఎన్నికల ప్రక్రియలో భాగంగా తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్,తెలంగాణ మజ్దూర్ యూనియన్,నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమి ఆధ్వర్యంలో ధర్వేశిపురంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో నమూనా బ్యాలెట్‌లకు పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ 2016లో జరిగిన ఎన్నికల అనంతరం ఆర్‌టిసి లో ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రభుత్వం, యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరించి కార్మికులను అనేక ఇబ్బందులకు గురిచేశాయని అన్నారు.కార్మిక సంఘాలు నిర్వహించిన అనేక పోరాటాల ఫలితంగా ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రస్తుత ఎన్నికల ప్రక్రియను తీసుకురావడం జరిగిందని తెలిపారు.ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్‌లు కూటమిగా ఏర్పడి అవగాహన ఒప్పందం చేసుకున్నాయని



తెలిపారు.రాష్ట్ర గుర్తింపు కోసం ఎంప్లాయిస్ యూనియన్‌కు బస్సు గుర్తుపై,జిల్లా గుర్తింపు కోసం తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు నిచ్చెన గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులను కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఏఎల్‌స్వామి,వీఎస్ రెడ్డి,దయాకర్, ఆర్.సుక్కు, జి.యాదయ్య,జె. పుల్లయ్య,సీహెచ్ వెంకన్న,కేఎల్ రెడ్డి, టి.సుదర్శన్,టీఎస్ రెడ్డి,ఎం.అంజయ్య,ఎన్.వెంకటేశ్వర్లు, కే.నారాయణ, వి.రేణుక, బి.శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఐటిపాముల లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి

**ప్రజా పక్షం/నకిరేకల్** : ఐటీపాముల రిజర్వాయర్ నుంచి చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నత్తనడకన సాగుతున్నందున వాటిని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల కోరారు.లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే పలు గ్రామాల చెరువులు, కుంటలు నింపడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.మండలంలోని గొల్లగూడెంలో ఆల్ ఇండియా రైతు సంఘం 36వ మహాసభల సందర్భంగా నిధి సేకరణలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ.. వ్యవసాయ పెట్టుబడులు పెట్టిన రైతులు ఎల్‌నినో ప్రభావంతో పలు విధాలుగా నష్టపోయారని తెలిపారు.కట్టంగూరు మండలంలోని ఐటీపాముల రిజర్వాయర్ నుంచి ప్రారంభమైన లిఫ్ట్ ఇరి



గేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, టౌన్ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, చందంపల్లి శాఖ కార్యదర్శి, మండల కమిటీ సభ్యుడు పాలడుగు పరమేష్, ఒంటెపాక కృష్ణ, ముక్కామల లింగయ్య, చిర్రబోయిన వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/రామన్నపేట** : మండల పరిధిలోని బోగారం గ్రామంలోకాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన అధ్యక్షుడుగా గోగు హరిప్రసాద్ యాదవ్ ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా కూనురు రామచంద్రం, గుర్రం లక్ష్మ ణ్, ప్రధాన కార్యదర్శిగా గుంతకంట్ల గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శులుగా మేడి నరసింహ, ఆవనగంటి ధనంజయ,కోశాధికారిగా కనుకు మల్లేష్,సహాయ కార్యదర్శిగా రాపోలు సత్యనారాయణ,కమిటీ కార్యవర్గ సభ్యులు గుంజె చంద్రం,మేడి స్వామి,రత్నం నరసింహ,గోగు రమేష్,నేరటి మల్లేశం,జెల్ల యాదగిరిలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో గ్రామశాఖ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్



పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల రాజిరెడ్డి,పూస బాలకృష్ణ,జినుకల ప్రభాకర్ భత్తుల కృష్ణ, శంబాల వెంకన్న చింతల వెంకటరెడ్డి,అక్రమ్, గంపల రామచంద్రారెడ్డి,మధ్యపురి ఐలయ్య,గోగు పద్మ సత్తయ్య యాదవ్,గంపల జీవన్ రెడ్డి,కందగట్ల రాహుల్,చిరబోయిన నవీన్ యాదవ్, వార్డు మెంబర్ మానససురేష్ యాదవ్,కనుక రాము,బొడ్డుపల్లి లింగయ్య,వనం కిష్టయ్య,జెల్ల దత్తాద్రి,ఎండి ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/బీబీనగర్** : ఇటీవల రైలు ప్రమాదంలో గొర్రెలను కోల్పోయిన ప్రమాద బాధితులను కుటుంబాలను యాదగిరి లక్ష్మి నరసింహస్వామి ట్రస్ట్ బోర్డ్ మెంబర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గొర్రెలను నష్టపోయిన వారిని ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా అఖిల భారత యాదవ మహాసభ మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు వాడి వెంట యాదాద్రి భువనగిరి



జిల్లా యాదవ మహాసభ అధ్యక్షులు చుక్కల సత్యం యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అయోధ్య యాదవ్, గొర్రెల మేకల పెంపకదారుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ రమేష్ యాదవ్, చీర ఐలయ్య యాదవ్, గుద శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్ హయాంలో సబ్బండ వర్గాలు సంతోషం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : కెసిఆర్ ప్రభుత్వ హాయంలో సంబండ వర్గాలు సంతోషంగా ఉన్నాయని నల్లగొండ మాజీ శాసన సభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ ఐక్య వేదిక,తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక,సంయుక్తంగా తలపెట్టిన తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ యాత్ర పోస్టర్ ను శుక్రవారం నల్లగొండలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో ఆడబిడ్డలకు ప్రత్యేక స్థానం ఉందని మాతృత్వ మాధుర్యాన్ని పంచి పెట్టగలరని మరణానికి వెరవక,ఆయుధం చేపట్టిన చరిత్ర తెలంగాణ మహిళలదని అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ,దేవులపల్లి రంగారావు,గంప రామ శర్మ,కిరణ్ కుమార్ శర్మ,కంచనపల్లి రవీందర్రావు, గుడా జయరావు,గూడా రాజేశ్వరరావు,నారపరాజు రజనీరావు పాల్గొన్నారు.

## నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ ఆశయం



**ప్రజాపక్షం/చండూరు:** ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ యొక్క ఆశయం అని చండూరు మున్సిపాలిటీ చైర్మన్ , ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ,గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. ప్రతి నెల 30మంది నిరు పేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాలయ విలువ చేసే నిత్యవసర సరుకుల పంపిణీ శుక్రవారం 33వ నెల నిత్యవసర సరుకులను నిరుపేదలకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , కౌన్సిలర్లు కోడి సుష్మా వెంకన్న, కటకం రమేష్ , కోఆప్షన్ సభ్యులు ఖలీల్ , కల్లెట్ల చంద్రకళ మారయ్య , షరీష్ ,ప్రవీణ్ శర్మ, గాంధీజీ విద్యా సంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న పాల్గొన్నారు.

## పర్వతాలుకు డాక్టరేట్ ప్రదానం

**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రతిష్టాత్మక హైదరాబాద్ విశ్వ విద్యాలయం గురువారం నిర్వహించిన 26వ స్నాతకోత్సవంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన పంబాల పర్వతాలుకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. పంబా ప్రదర్శన కళ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక అంశాల అధ్యయనం అనే అంశంపై పర్వతాలు చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్‌ను అందజేశారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సమక్షంలో యూనివర్సిటి ఛాన్సలర్ జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అనురాధ చేతుల మీదుగా పంబాల పర్వతాలు డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. ఈసందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ విద్యా ప్రస్థానంలో డాక్టరేట్ ఒక చిరస్మరణీయమైన మైలురాయి అని, ఈస్థాయికి చేరుకోవడానికి సహకరించిన గురువులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులందరికి కృతజ్ఞతలు తెలిపారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన పర్వతాలు ఉన్నత విద్యలో సాధించిన ఈ ఘనత పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.





# ఉచిత మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలం గౌస్‌కొండ గ్రామంలో వాకిటి లక్ష్మమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మంచినీటి శుద్ధి కేంద్రాన్ని చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ స్వచ్ఛదంగా ఫౌండేషన్ వారు చేసే సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు.అందరు సద్వినియోగం చేసుకోవా లని కోరారు.సర్పంచ్ మునుకుంట్ల నరేష గౌడ్ ఉపసర్పంచ్ వాకిటి జంగారెడ్డి సిఐ సతీష్ రెడ్డి ఎస్ఐ జగన్ మాజి సర్పంచులు లావణ్య శ్రీనివాస్ గౌడ్ రవీందర్ రెడ్డి ,శోభ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



**ప్రజాపక్షం/దేవరకొండ;** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా పట్టణంలోని ఐబి వద్ద పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నర్సింహా, సినియర్ నాయకులు నక్క వెంకటేష్, నల్గొండ జిల్లా ఐటి సెల్ కన్వీనర్ భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అంజయ్య, రాము, శంకర్ పాల్గొన్నారు.

# జనార్దన్ గౌడ్‌కు నివాళి

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** మండలంలోని కామునిగూడెం కి చెందిన లోడి జనార్దన్ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ బీసు చందర్ గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించి,మృతదేహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కోరే బిక్షపతి,గౌడ సంఘం అధ్యక్షులు పంజాల నర్సయ్య గౌడ్,కోరిటికల్ గౌడ్ సంఘం అధ్యక్షులు రాగటి యాదగిరి గౌడ్,గౌడ సంఘం నాయకులు గడ్డం దశరథ గౌడ్,నాతి రాజు గౌడ్,గుండెబోయిన ఐలయ్య గౌడ్,లోడి మధు గౌడ్,లోడి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# జీవనోపాధి పెంపుదలే లక్ష్యంగా విబిజిరాంజీ పథకం

**ప్రజాపక్షం/నూతన్‌కల్:** జీవనోపాధి పెంపుదలే లక్ష్యంగా విబిజి రాంజీ పథకం ఉపయోగపడుతుందని మండల అభివృద్ధి అధికారి సునిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా గతంలో నిర్వహించిన 100 రోజుల పని కాలాన్ని పెంచి ప్రతి ఆర్థిక సంవత్సరంలో ప్రతి ఇంటికి 125 రోజుల పని కల్పించి ప్రజలకు జీవనోపాధి కల్పించడంతో పాటు దేశ అబివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నాగం సరిత, ఎంపివో హరిసింగ్, ఎపివో శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి శర్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధిక ప్రణాళికలు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/మోతె:** గ్రామాలాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జడ్పి సిఈవో శీరిష అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాఘవపురం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ సర్పంచ్ మద్ది మంజుల బాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పంచాయతీలో సుమారు 14 రకాల రికార్డులపై అవగాహన కల్పించారు. 2027/28 సంవత్సరానికి ఉపాధి హామీ పనులు ప్రణాళిక చేపట్టాలని చెప్పారు. గ్రామంలో చిన్నచిన్న పిల్లలకు బాల్య వివాహాలు చేయవద్దని, చట్ట ప్రకారం చర్యలుంటాయని తెలిపారు. వర్షభావ కారణంగా భూగర్భజలాలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయని, ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు తీసుకొని నీటి నిల్వలు పెంచుకోవాలన్నారు. అనంతరం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దోసపాటి అనురాధ, కోల లింగయ్య, స్వామినాయక్, బొర్ర వెంకటేష్, అరుణ కిషన్‌రావు, కొరివి నాగమణి, వీరస్వామి, పల్లెల రేణుక, యండి ఇర్ఫాన్ పాల్గొన్నారు.

# ఆహారభద్రత కార్డులు పేద కుటుంబాలకు భరోసా



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఆహారభద్రత కార్డులు పేదల కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస గౌడ్, తెలంగాణ రాష్ట్ర పెరిక కార్పోరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని గోవిందాపురంలో సుమారు 650 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసి ప్రజల కడుపునిండా అన్నం పెడుతుందని అన్నారు. పేద కుటుంబాలకు భరోసా కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం మేమున్నామంటూ హామీ ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉదయభాను, బొల్లెద్దు ధనమ్మ, సంపత్‌రెడ్డి, డీలర్ ధనమూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైతు మహాసభలను విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కార్మిక, కర్షక పోరాటాల స్ఫూర్తితో నల్లగొండలో జరగనున్న అఖిల భారత రైతు మహాసభలను విజయవంతం చేయాలని ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో కార్మికులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల పురిటిగడ్డ అయిన నల్లగొండ జిల్లాలో నవంబర్ 15 నుండి 18వ తేదీ వరకు అఖిల భారత 36వ రైతు మహాసభలు జరగనున్నాయని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశ రైతాంగ ఉద్యమ చరిత్రలోనే ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. అదే పోరాట స్ఫూర్తితో ప్రస్తుత రైతాంగ, కార్మిక సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవి నాయక్, రైల్వే హమాలి యూనియన్ నాయకులు నంద్యాల వేణుధర్ రెడ్డి, బధ్యానాయక్, ధనావత్ భాగ్యా నాయక్, బాణావతి రెడ్యా నాయక్, అజమీరా హుష్యా, బాలు పాల్గొన్నారు.

# పంచాయతీ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో అవసరాలకు అనుగుణమైన పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి సూచించారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని మిర్యాలగూడ మండల పరిధిలోని బొట్యానాయక్ తండా, గూడూరు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో డీపీవో తరుణ్ చక్రవర్తి, ఎంపీడీవో ఎం. శేషగిరిశర్మ, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, గ్రామీణాభివృద్ధి ఏపీడీ గార్లపాటి జ్యోతి లక్ష్మి , తహశీల్దార్ పి. శ్రీనివాస్, ఎంపీవో మాతంగి రమేష్ పాల్గొని ప్రసంగించారు. జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం గ్రామసభల ఎజెండాపై చర్చించారు.గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2027/28 నిర్దేశిత లక్ష్యాల కోసం పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్, వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల తయారీపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీబీజీ రామ్ జి సిబ్బంది, గ్రామ స్థాయి అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఆరోగ్య శిబిరం

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని మేళ్లవాయి గ్రామంలో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గురుమాత శ్రీదివ్య,శ్రీ రమణ చక్రవర్తులు శుక్రవారం తెలిపారు.దివ్య చక్ర చారిటబుల్ ట్రస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ ఆదివారం రోజున శ్రీహిత హాస్పిటల్, చైతన్యపురి, హైదరాబాద్ వారిచే ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిబిరంలో చెవి,జనరల్ సర్జన్,జనరల్ ఫిజీషియన్ వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించనున్నారు. గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/డిండి :** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేసి పత్తి రైతులను దళారుల భారీ నుండి ఆదుకోవాలని సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిసిఐ అధికారులను కోరారు. శుక్రవారం మైనోద్దీన్ స్థానికంగా మాట్లాడుతూ ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో రైతుల పంటలు సరైన సమయంలో వర్షాలు కురవక పూర్తి స్థాయిలో పంటలను పోగోట్టుకున్నారని కొంత మంది రైతులు బోరు బావుల వద్ద , మరికొందరు పంట నష్టపోగా మిగిలిన పంట ఎలాగో అలాగా పండించిన పత్తిని సైతం గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలంటే దళారులు నానా ఆంక్షలు, తూకంలో మోసాలు చేస్తూ రైతులను నిండా ముంచే ప్రమాదం ఉందని రైతులు కష్టకాలంలో పండించిన పత్తి పంట గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలంటే ప్రభుత్వం తక్షణమే సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. సిసిఐ లో 8 శాతం నుండి 12శాతం పత్తికి 8300 నుండి 8600 వరకు ధర ఉన్నప్పటికి దళారులు తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను మరో రకంగా మోసం చేసే ప్రమాదం నుండి ప్రభుత్వం సిసిఐ కేంద్రాలను వీలైనంత త్వరలో ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

# జిల్లా కబడ్డీ అసోసియేషన్ మేనేజర్‌గా ఈశ్వర్

**ప్రజాపక్షం/నిడమనూరు:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో శుక్రవారం నుండి నాలుగు రోజులపాటు జరగనున్న సబ్ జూనియర్ కబడ్డీ జిల్లా జట్టు మేనేజర్ గా నిడమనూరు మండల కేంద్రానికి చెందిన ఉన్న ఈశ్వర్ ప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ భూలోకరావు కార్యదర్శి గొట్టిపాటి కర్తయ్యలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ క్రీడాకారులను సమన్వయం చేస్తూ ప్రతి ఆట లో విజయాన్ని అందుకునేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. తనకు మేనేజర్‌గా అవకాశం కల్పించిన కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుల్లోకరావు,కర్తయ్య లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా సంతోష్ యాదవ్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం గ్రామంలోని శ్రీకృష్ణ యా దవ సంఘం అధ్యక్షుడిగా చిలుక సంతోష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శుక్రవారం జరిగిన నూతన కమిటి ఏర్పాటులో ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం యాదవ్ ప్రధాన కార్యదర్శిగా రెడ్డి నరేందర్ కార్యదర్శిగా నారి దేవేందర్ కోశాధికారిగా ఎర్రగోని భాస్కర్ యాదవ్ ప్రచార కర్తగా మాకోలు రమేష్ యాదవ్ లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను నియమించుకొని సంఘం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఉపసర్పచ్‌గా ఎంత బాధ్యతతో ప్రజలకు సేవ చేస్తున్నానో అంతే విధిగా సంఘసభ్యుల శ్రేయస్సుకు పటిష్టతకు పాటుపడతానని హామి ఇచ్చారు. ఈమేరకు నూతనంగా ఎన్నికైన సభ్యులందరికి పోచంపల్లి పిఎసిఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్ గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి,వార్డు సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

# మద్యం అమ్మకాలు నిషేదం చేస్తూ గ్రామపాలకవర్గం తీర్మానం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** మహాత్మగాంధి జయంతి సందర్భంగా నివాళులు అర్పించి పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామంలో బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు నిషేదం విధిస్తూ గ్రామ సభ సాక్షిగా సర్పంచ్ చుక్క శోభ శంకర్ ఉపసర్పంచ్ పడమటి మహిపాల్ రెడ్డి పోచంపల్లి పిఎసిఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్ సమక్షంలో పాలకవర్గం, గ్రామస్తులు తీర్మానం చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.శుక్రవారం జరిగిన గ్రామ సభలో మహిళల అభ్యర్ధన మేరకు ఈకఠిన నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.ఒక వేళ ఎవరైనా తీర్మాణానికి వ్యతిరేకంగా అమ్మకాలు జరిపితే మొదటి తప్పుగా రూ.10వేలు,రెండవ సారికి రూ. 50వేల జరిమాన విధించనున్నట్లు పాలకవర్గం తీర్మానించిందని చెప్పారు.ఈ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు యువకులు అన్ని పార్టీల నాయకులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.



## ఉత్తమ ప్రిన్సిపాల్‌గా మహమ్మద్ జబ్బార్

**ప్రజాపక్షం/మర్రిగూడ :** ఇలెర్నింగ్ అకాడమీ డాక్టర్ పి.వేద ప్రకాష్ ఆధ్వర్యంలోహైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన గురువందనం కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు మర్రిగూడకు దక్కింది.మండలంలోని ఎంజేఆర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జబ్బార్‌ను రాష్ట్రస్థాయి బీఈడీ కళాశాలల ఉత్తమ ప్రిన్సిపాల్‌గా గుర్తించి అవార్డు ప్రదానం చేశారు. చాణక్య యూనివర్సిటీ బెంగళూరు ప్రొఫసర్ వి. సుధాకర్, న్యూఢిల్లీ అసోసియేట్ ప్రొఫసర్ డాక్టర్ పి. శంకర్ చేతుల మీదుగా ఆయనకు మెమెంటో,ప్రశంసా పత్రం అందజేశారు.

## ఘనంగా అన్నదానం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** లతీఫుల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గుట్ట మెట్ల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ముతవల్లి సమీయుల్లా ఖాద్రి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 2,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించామని తెలిపారు. ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు సేవ చేయడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముతవల్లీలు గౌస్ ఖాద్రి,సల్మాన్ ఖాద్రి, జమాల్ ఖాద్రి,ఉర్సు కమిటీ ఉపాధ్యక్షులు హాషం,మసీయుద్దీన్,నిర్వాహకులు జయబాబు,ఫిరోజ్, నవీన్, సమద్,ఉమర్,తాహీర్,ఎజాజ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## తహాశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐపై దాడి.. ఇద్దరిపై కేసు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బొమ్మలరామారం తహాశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేసి, దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొండెం వెంకట్ రెడ్డి తహాశీల్దార్ కార్యాలయంలో విధుల్లో ఉండగా, బొమ్మలరామారం గ్రామానికి చెందిన బెజ్జంకి వెంకట్ రెడ్డి, ఆయన కుమారుడు ప్రమోద్ రెడ్డి కార్యాలయానికి వచ్చి రెవెన్యూ ఇన్స్పెక్టర్ విధులకు ఆటంకం కలిగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇరువురు తనను అసభ్య పదజాలంతో దూషించి, చేతులతో కొట్టి, చంపుతామని బెదిరించినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు బొమ్మలరామారం ఎస్ఐ శ్రీశైలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని గాంధీ జయంతి..



**ప్రజాపక్షం/తిప్పర్తి :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు తిప్పర్తి మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించలేదు.మండలంలోని కొన్ని కార్యాలయాల్లో అధికారులు,సిబ్బంది ఘనంగా గాంధీ జయంతి నిర్వహించగా,మరికొన్ని కార్యాలయాల్లో మాత్రం ఎలాంటి వేడుకలు నిర్వహించకపోవడం గమనార్హం.ముఖ్యంగా మండల సమాఖ్య కార్యాలయం,నీటిపారుదల శాఖ కార్యాలయం,ఉపాధి హామీ పథక కార్యాలయంతో పాటు మరికొన్ని శాఖల కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి దండ వేసి నివాళులర్పించే కార్యక్రమం కూడా చేపట్టలేదు. దీంతో ఆయా కార్యాలయాల ముందు నుండి వెళ్తున్న ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.గాంధీ జయంతి వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన రోజున వేడుకలు నిర్వహించని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్ ప్రక్రియ పూర్తిగా బిజెపికి అనుకూలం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియ పూర్తిగా బిజెపికి అనుకూలంగా సాగుతోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని యాదవ భవన్‌లో శుక్రవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ సిఈసి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రధాని మోదీ,అమిత్ షాలకు తొత్తుగా వ్యవహరిస్తూ దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది పేదల ఓట్లను తొలగించారని విమర్శించారు.ఇది రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు.ఏఐసిసి,పిసిసి పిలుపు మేరకు అక్టోబర్ 2 నుండి 8 వరకు సేవ్ డెమోక్రసీ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని,ఇందులో భాగంగా ఈ నెల 5న అఖిలపక్ష సమావేశం,7న క్లాక్ టవర్ నుండి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే బర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని, మోదీ,అమిత్ షాలు రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ ప్రెస్‌మీట్‌లో టిజెఎస్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ యాదవ్,ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లాపల్లి పరమేష్,ఎస్‌సిసెల్ అధ్యక్షులు బోడ స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ముంతాజ్ అలీ,జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల రవీందర్ రెడ్డి,పగిళ్ల రాజు పాల్గొన్నారు.

## కొమ్మిడి లక్ష్మారెడ్డికి సీపీఐ నేతల నివాళి



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి నాలుగు పర్యాయాలు సర్పంచ్గా సేవలందించిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి మృతదేహానికి సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మారెడ్డి పులిగిల్ల గ్రామ అభివృద్ధికి సర్పంచ్గా విశేష సేవలందించారని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఎర్రజెండాను భుజాలపై మోసిన నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అనేక మంది కార్యకర్తలను తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. లక్ష్మారెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొంటూ సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి తరఫున ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కార్యవర్గ సభ్యులు పోలేపాక యాదయ్య, సల్వాద్రి రవీందర్, సుద్దాల సాయి కుమార్, సోప్పరి వెంకటేశం, బత్తుల బిక్షపతి, మంద ముత్తయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## గాంధీ జయంతి రోజున చేపల విక్రయాలు..



**ప్రజాపక్షం/నందికొండ :** గాంధీ జయంతి సందర్భంగా చేపల విక్రయాలపై ఆంక్షలు ఉన్నప్పటికీ నందికొండలో అవి అమలుకు నోచుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఏకంగా మున్సిపల్ కార్యాలయం ఎదుటే బహిరంగంగా చేపల విక్రయాలు కొనసాగడం చర్చనీయాంశంగా మారింది.గాంధీ జయంతి రోజున సాధారణంగా మాంసం,చేపల విక్రయాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపడుతుంటారు. అయితే శుక్రవారం నందికొండలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపించింది. ఎలాంటి భయం లేకుండా విక్రయదారులు బహిరంగంగా చేపలను విక్రయించగా, ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో ఎగబడి కొనుగోలు చేశారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయం ఎదుటే ఈ విక్రయాలు జరగడం స్థానికంగా చర్చకు దారితీసింది. ఆంక్షలు అమలు చేయాల్సిన అధికారులు ఈ వ్యవహారాన్ని ఎందుకు పట్టించుకోలేదనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.గాంధీ జయంతి ప్రాముఖ్యతను పక్కనపెట్టి బహిరంగంగా చేపల విక్రయాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



## టిప్పర్లను అడ్డుకున్న సర్పంచ్

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని శివన్నగూడెం నుంచి గట్టుప్పల మండలం తేరటిపల్లి వరకు నిర్మిస్తున్న రెండు వరుసల రహదారికి మట్టి తరలిస్తున్న టిప్పర్లను కొట్టాల సర్పంచ్ కల్లెట్ల లింగయ్య శుక్రవారం అడ్డుకున్నారు.రోడ్డు నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్ రోడ్డుపై నీళ్లు చల్లకుండా టిప్పర్లతో వేగంగా మట్టిని తరలిస్తున్నారని,దీంతో గ్రామంలో దుమ్ము ధూళి వ్యాపించి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సర్పంచ్ లింగయ్య స్పందిస్తూ టిప్పర్లను అడ్డుకుని కాంట్రాక్టర్‌కు హెచ్చరిక జారీ చేశారు. రోడ్డుపై నీళ్లు చల్లిన తర్వాతనే టిప్పర్లు నడపాలని,లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నిబంధనలు పాటించకుండా పనులు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## రజక సంఘం మండల అధ్యక్షుడిగా జూపల్లి పాండు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బొమ్మలరామారం మండల రజక సంఘం నూతన కమిటీని శుక్రవారం గౌరవ అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల రజక సంఘం అధ్యక్షుడిగా రంగాపురం గ్రామానికి చెందిన జూపల్లి పాండును ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా ఎడిజర్ల భూపాల్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జూపల్లి వెంకటేష్, రాచకొండ నవీన్, వట్టిపల్లి నరసింహులు, కోశాధికారిగా జూపల్లి జంగయ్య, సోషల్ మీడియా ఇన్చార్జిగా వడ్లకొండ అనిల్ను ఎన్నుకున్నారు.సలహాదారులుగా జూపల్లి పాపులు, వెంకటేష్, లింగయ్య, శ్రీకాంత్, భారత్, రాములు, సత్యనారాయణ, లింగం, మహేష్, వినోద్, భాస్కర్, కనకరాజు, హరికృష్ణ, భానుప్రకాష్, రఘు, బిక్షపతి, మహేష్ తదితరులను నియమించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జూపల్లి పాండు మాట్లాడుతూ మండలంలోని రజక సంఘం సభ్యుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## కెవిపిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/భువనగిరి :** కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) 29వ ఆవిర్భావ జిల్లా కేంద్రం లో మల్లారెడ్డి ట్రస్ట్ వద్ద ఘనంగా జరిగింది. జెండాను కెవిపిఎస్ జిల్లా అ ధ్యక్షుడు దుబ్బ లింగం ఆవిష్కరించాడు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నంపట్ల క్రిష్ణ మాట్లాడుతూ 1998 అక్టోబర్ 2 న ఏర్పడిన కెవిపిఎస్ దళిత, గిరిజన, బలహీన, వర్గాలపై కొనసాగుతున్న అంటరానితనం, కుల వివక్ష పై రాజీలేని పోరాటాలు కొనసాగించిందని అన్నారు. దళితుల సామాజిక, ఆర్థిక, సమానత్వం, కోసం కేవీపీఎస్ నిర్విరామమైన పోరాటాన్ని కొనసాగిస్తుందని అన్నారు. దళిత, బడుగు, పీడిత వర్గాల ఐక్యతకై కేవీపీఎస్ పని చేస్తుందని ఉపాధి ఉద్యోగం సంక్షేమ పథకాలు అమలుకై రాజీలేని పోరాటాలను కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ నాయకులు, సిఐటియు జిల్లా నాయకులు అదేవిధంగా సామాజిక ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు కీలకం

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని, ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మాట కొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ అన్నారు. ఆయన 11 మండలంలోని ఆరెగూడెంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సీసీ కెమెరాలు ఉండడం వల్ల అసాంఘిక కార్యక్రమాలకు, దొంగతనాలకు అడ్డుకట్ట వేయొచ్చని అన్నారు.గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మాగాంధీకి ఘన నివాళులు




























# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.పాత్రికేయుల హక్కులు,భద్రత,సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని టీయూడబ్ల్యూజేఐజేయూ నకిరేకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశానికి కూడా వినతి పత్రం అందజేశారు.నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని,పాత్రికేయుల భద్రతకు జాతీయ చట్టం తీసుకురావాలని కోరారు.రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల కింద గతంలో కల్పించిన హక్కులను పునరుద్ధరించాలని,కొత్త వేతన మండలి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల హామీ మేరకు నల్లగొండ నగరంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలోమండల అధ్యక్షుడు బెల్లిసాయి,ప్రధాన కార్యదర్శి గడగోజు రవీంద్రాచారి, ఉపాధ్యక్షుడు తూడి మోహన్,సీనియర్ జిల్లా నాయకులు కందగట్ల శ్రీధర్,రాంబాబు,మాచర్ల రాములు,నరసింహ,శ్రీనివాస్‌రెడ్డి,నాగార్జున రెడ్డి, గోపి, తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చిట్యాల:** అనాదిగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పరిష్కరించేలా చూడాలని నల్లగొండ జిల్లా చిట్యాల మండలానికి చెందిన టియుడబ్ల్యూజె సభ్యులు పెద్దకాపర్తిలోని గాంధీ గుడిలో గాంధీజీ విగ్రహానికి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులు మెండె వెంకన్న, పోకల కరుణాకర్‌లు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇస్తామని పాలకులు హామీల వరకు పరిమితమవుతున్నారే గాని, సంవత్సరాలు గడుస్తున్నా వాటిని నెరవేర్చడం లేదని విమర్శించారు. ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందేలా హెల్త్ స్కీంను అమలు చేయాలని, పాత్రికేయుల భద్రత కోసం జాతీయ చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు చెరుపల్లి శ్రీనివాస్, ఏళ్ళ వెంకన్న, కూనూరు మధు, సూరెపల్లి సూర్యనారాయణ, అమరోజు వెంకన్న, పాల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దేవరకొండ;** టియూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో శుక్రవారం



దేవరకొండ పట్టణంలోని గాంధీ బజార్‌లో గల గాంధీ విగ్రహం ఎదుట ప్రింట్ మీడియా దేవకొండ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా టియుడబ్ల్యూజే(ఐజెయు) దేవరకొండ డివిజన్ అధ్యక్షులు గాదె గిరిధర్ రావు, దేవరకొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వైఎస్ కరుణాకర్‌లు మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇస్తున్న హెల్త్ కార్డులకు ఆసుపత్రులలో క్యాష్‌లెస్ విధానాన్ని అమలు చేయాలని, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన ఎంఎల్‌ఏ సమస్యలను పరిష్కరించునున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో శ్రీపతిరావు, ఇలియాస్, వెంకటేష్, వెంకటేశ్వర్లు, జోసెఫ్, వెంకటయ్య, రామాదాసు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చండూరు:** టీయుడ్యూజే ఐజేయు పిలుపు మేరకు జర్నలిస్టుల సమ



స్యల పరిష్కారం , వారి సంక్షేమం కోసం శుక్రవారం టీయుడ్యూజే ఐజేయు చండూరు మండల కమిటీ ఆధర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురష్కరించుకొని పట్టణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహాత్మాగాంధీ విగ్రహానికి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయుడ్యూజే ఐజెయు జిల్లా సహాయ కార్యదర్శి కేసాని శ్రీధర్‌రెడ్డి , టీయుడ్యూజే ఐజెయు చండూరు మండల అధ్యక్షుడు కర్నాటి వెంకటేశం , ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్ , కోశాధికారి నారబత్తుల రవీంద్రాచారి , నియోజకవర్గం అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్ , ప్రధాన కార్యదర్శి ఎరుకల వంశీకృష్ణ , నాయకులు నల్ల స్వీఆమి , మాదగోని శ్రీనివాస్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సుదీర్ఘకాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) నల్లగొండ జిల్లా అధ్యక్షులు కలిమెల నాగయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి అస్లాం, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షులు జూపల్లి బాలాజీ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం జర్నలిస్టు సంఘాల దేశవ్యాప్త ధర్నా పిలుపులో భాగంగా టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులు భారీ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అలాగే సాగర్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లను నేరుగా కలసి జర్నలిస్టుల సమస్యలపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన వినతిపత్ర ప్రతిని అందజేసి అసెంబ్లీలోనూ, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు హమీద్, వాడపల్లి రమేష్, నాజీమ్, అశోక్, రంగా శ్రీనివాస్, పుప్పాల యాదగిరి, సుమన్, కరుణాకర్, రమేష్, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్, కామిశెట్టి రామకృష్ణ, హరీష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మర్రిగూడ :** గాంధీ జయంతి పురస్కరించుకుని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా పిలుపు మేరకు శుక్రవారం జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. మండల ఐజేయూ అధ్యక్షుడు రఘుమయ్య,జాయింట్ సెక్రటరీ కుక్కడపు ముత్యాలు గౌడ్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ప్రతి జర్నలిస్టుకు ఆరోగ్య భద్రత, ఇండ్ల స్థలాలు,ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్రపతికి లేఖలు పంపారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎండీ రజాక్, తుప్పరి రఘు,కె.వెంకటేష్,ఆంజనేయులు,లింగస్వామి,ప్రకాష్, నాగరాజు,మారయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/త్రిపురారం :**జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బచ్చలకూరి వెంకన్న అన్నారు.శుక్రవారం ఐజేయూ యూనియన్ పిలుపు మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు మండల విలేకరులు నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తల్లం శ్రీనివాస్,శ్రీకాంత్,నరేష్,చీదెల శ్రీనివాస్,జూపల్లి రవి,నరేందర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/నాంపల్లి :**అర్హులైన జర్నలిస్టులందరికీ ఇల్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో పాత్రికేయులు వినతి పత్రం అందజేశారు.గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తమ హక్కుల కోసం నిరసన తెలిపారు.అనంతరం పాత్రికేయులు మాట్లాడరూ.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ఊరుపాక వెంకటయ్య,గాదెపాక రవీందర్, నేరళ్ల సైదులు,కాటిక సైదులు,గాదెపాక నాగరాజు,నేరళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి రోజున పాఠశాల నిర్వహణపై ప్రశ్నలు

### వలిగొండలో శ్రీ చైతన్య పాఠశాల తీరుపై తల్లిదండ్రుల ఆందోళన

**ప్రజాపక్షం/వలిగొండ :** మహాత్మా గాంధీ జయంతి... దేశవ్యాప్తంగా జాతిపితను స్మరించుకునే రోజు. అలాంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన రోజున వలిగొండ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ పై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా సెలవు అమలులో ఉండగా పాఠశాలలో విద్యార్థులతో క్లాసులో నిర్వహిస్తున్నారు. గతంలోనూ ఈ పాఠశాలపై అనేక ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలోనే పుస్తకాలు విక్రయం పై విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించారు. పాఠశాలకు పూర్తిస్థాయిలో అనుమతులు కూడా లేవని చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

మీడియా ప్రతినిధులు ప్రశ్నించగానే పిల్లలను అప్పటికప్పుడు పంపించిన యాజమాన్యం...

పాఠశాలలో విద్యార్థులు ఉన్నారనే సమాచారంతో మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లిన సమయంలో విద్యార్థులను బయటకు పంపించారు . ఈ పరిణామం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

**ఈ పాఠశాలకు నిబంధనలు పట్టవా...**

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ పరిధిలో ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, పర్యవేక్షణ వ్యవస్థలు ఉన్నాయి. అందువల్ల సెలవు రోజున పాఠశాల నిర్వహణకు సంబంధించి ఏవైనా ప్రత్యేక అనుమతులు లేదా విద్యాశాఖ ఆదేశాలు ఉంటే వాటిని పాఠశాల యాజమాన్యం వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**అధికారుల దృష్టికి...** ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్లో సంప్రదించగా పాఠశాల యాజమాన్యం పిల్లలను వెనక్కి పంపించివేసింది. ఏది ఏమైనాపటికి మహాత్మా గాంధీ జయంతి రోజున పాఠశాల నిర్వహించడం పై విద్యార్థి సంఘాలు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

